# సాక్షి విశాఖపట్నం

బుధవారం । 6 । డిసెంబర్ । 2023






**అవకాశాల వేదిక.. ఆ హబ్**

ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఏర్పాటైన 'ఆ-హబ్' యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. 8లో



**కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం**

నగర పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్ మంగళవారం త్రీ టౌన్, ఫోర్త్ టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను సందర్శించారు. 8లో



**డాగ్ స్క్వాడ్ తనిఖీలు** 8లో

నార్కోటిక్స్‌ను గుర్తించడంతో ప్రత్యేక శిక్షణ పొందిన విక్కీ(స్నిఫర్ డాగ్) విశాఖ రైల్వే స్టేషన్‌లో తన విధులను ప్రారంభించింది.

## న్యూస్‌రీల్

### 9న మెగా లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

**విశాఖ లీగల్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ నెల 9న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లా న్యాయమూర్తులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షిదారులు, వివిధ ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు మెగా లోక్ అదాలత్‌లో పాల్గొనాలని కోరారు. పౌర, నేర శిక్షాస్మృతి పరిధిలోని ఎంపిక చేసిన కేసులు, నిరాధరణకు గురైన చెక్కులు, బ్యాంకులు, బీమా కంపెనీ, ఇతర ప్రభుత్వ సంస్థలు, మహా నగర పాలక సంస్థ, వీఎంఆర్డీఏ తదితర సంస్థలు తమ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. రాజీ కాగలిగిన కేసులను పోలీస్ అధికారులు గుర్తించి.. ఎటువంటి సమస్య లేకుండా వాటి రాజీకి కృషి చేయాలని కోరారు. మెట్రో సెషన్స్ జడ్జి శ్రీదేవి, అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, విశాఖ న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు పాల్గొన్నారు.

### జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాయిదా

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీలో బుధవారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశం తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, జీవీఎంసీ యంత్రాంగం నిమగ్నమై ఉందన్నారు. డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్ల అభ్యర్థన, జీవీఎంసీ కమిషనర్ సిఫార్సు మేరకు ఈ సమావేశం వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు. సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

### 12న అనంతుని దీపోత్సవం



అనంతుని మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న నార్త్ ఏసీపీ శివరామిరెడ్డి

**పద్మనాభం:** పద్మనాభంలో కొలువైన అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం ఈ నెల 12న జరగనుంది. ఈ కార్యక్రమానికి పోలీస్ శాఖ తరఫున పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నార్త్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి వెల్లడించారు. అనంత పద్మనాభ స్వామి మెట్లు, పరిసర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బందోబస్తుకు 400 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని, దీపోత్సవం రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ ఎస్.సన్యాసినాయుడును ఆదేశించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి.. సూచనలు చేశారు.

### రేపటి నుంచి పవిత్రోత్సవాలు



**కొమ్మాది:** రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తొలిసారిగా పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు అంకురార్పణ, శుక్రవారం పవిత్ర ప్రతిష్ఠ, శనివారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు పవిత్ర సమర్పణ, ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

### 10 నుంచి క్యారమ్స్ పోటీలు

**విశాఖ స్పోర్ట్స్:** గీతం కేఆర్ఎం ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఫెడరేషన్ కప్ క్యారమ్స్ టోర్నీ జరగనుంది. ఆల్ ఇండియా క్యారమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర క్యారమ్స్ సంఘం సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో పలు రాష్ట్రాలు, సంస్థల బోర్డ్‌లకు చెందిన ఆటగాళ్లు పోటీపడనున్నారు. నాలుగు రోజుల పాటు నాకవుట్ పద్ధతిలో పురుషుల సింగిల్స్, డబుల్స్‌తో పాటు మహిళల సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నారు.

# దంచికొట్టిన వాన



నైట్‌ఫుడ్‌కోర్టు వద్ద..

- తుపాను ప్రభావంతో కుండపోత వర్షం
- నగరంలో 9.5 సెం.మీల వర్షపాతం
- నేడు తేలికపాటి వానలకే పరిమితం

**సాక్షి, విశాఖపట్నం:** మిచాంగ్ తుపాను దంచికొట్టింది. విశాఖలో భారీ వర్షాన్ని కురిపించింది. చాన్నాళ్లగా వానల కోసం అర్రులు చాస్తున్న జనానికి ఆ కొరతను తీర్చింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా 10 సెం.మీల వర్షం కురిసింది. ఇంకా పలు ప్రాంతాల్లో 5-9 సెం.మీల వర్షపాతం నమోదైంది. గతంలో హుద్‌హుద్ పెను తుపాను సృష్టించిన విధ్వంసం నేపథ్యంలో మిచాంగ్



చావులమదుం వద్ద..

తుపాను విశాఖ జిల్లాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని తొలుత సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. అందుకు భిన్నంగా ఈ తుపాను భారీ వర్షానికే పరిమితమైంది. కేవలం ఈదురుగాలులు వీయడంతో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించ లేదు. జిల్లాలో పంటలకు కూడా అంతగా నష్టం వాటిల్ల లేదు. దీంతో ప్రజానీకంతో పాటు అధికార యంత్రాంగం, రైతాంగం ఊపిరి పీల్చుకుంది. మరోవైపు మిచాంగ్ తుపాను ప్రభావంతో మంగళవారం వేకువజాము నుంచి వర్ష ఉధృతి పెరిగింది. సాయంత్రం వరకు అరకొరగా కురిసినప్పటికీ, తుపాను తీరాన్ని దాటాక రాత్రికి మళ్లీ పుంజుకుని కుంభవృష్టిని తలపించింది. భారీ వర్షానికి నగరంలోని రోడ్లు, డ్రైయిన్లు పొంగి పొర్లాయి. కొంతసేపు భారీగా కురుస్తూ, మధ్యమధ్యలో కాస్త విరామం ఇస్తూ కురిసిన వర్షం జనానికి అంతగా ఇబ్బంది కలిగించ లేదు. అయితే ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఆసక్తి చూపలేదు. అంతగా దుకాణాలు తెరవలేదు. రోడ్డు పక్కన వ్యాపారాలు సాగలేదు. విశాఖ జిల్లాలో ప్రాథమిక సమాచారం ప్రకారం వ్యవసాయ శాఖకు సంబంధించి 35 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. పూర్తి స్థాయి పంట నష్టంపై అధికారులు బుధవారం నివేదికను సిద్ధం చేయనున్నారు.

**వర్షపాతం ఇలా.. (సెం.మీలలో)**

| ప్రాంతం | వర్షపాతం | | |
|---|---|---|---|
| సీతమ్మధార | 11.6 | వుడా పార్క్ | 7.4 |
| ధైరీఫారం | 11.4 | అగనంపూడి | 7.3 |
| పెదగంట్యాడ | 8.9 | గాజువాక | 6.9 |
| మహారాణిపేట | 8.7 | ఎంవీపీ | 5.6 |
| పెందుర్తి | 8.3 | ఆనందపురం | 5.1 |
| | | దువ్వాడ | 5.5 |
| | | సింహాచలం | 4.8 |



వర్షంలో తడుసుకుంటూ వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకులు

**కొనసాగుతున్న రైళ్ల రద్దు**

తుపాను తీవ్రత దృష్ట్యా మంగళవారం కూడా విశాఖ వచ్చే, విశాఖ మీదుగా వెళ్లే అనేక రైళ్లు రద్దయ్యాయి. నేడు, రేపు కూడా రైళ్ల రద్దు కొనసాగుంది. అలాగే తుపానుతో ఏర్పడిన ప్రతికూల వాతావరణంతో సోమవారం విశాఖ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ఆరు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. మంగళవారం నాటికి ఆ సంఖ్య 23కి చేరుకుంది. బుధవారం నాలుగు ఇండిగో సర్వీసులను రద్దు చేశారు. మరోవైపు తుపాను ప్రభావంతో జిల్లాలోని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. కాగా తుపాను తీరాన్ని దాటి బలహీన పడడంతో బుధవారం విశాఖ జిల్లాలో తేలికపాటి వర్షాలే కురవనున్నాయి. ఈదురుగాలులు కూడా తగ్గుముఖం పట్టనున్నాయి.

# తీరం అల్లకల్లోలం

ముందుకొచ్చిన సముద్రం.. కోతకు గురైన తీరం





భీమిలిలోని బోయివీధి వద్ద ముందుకొచ్చిన సముద్రం (ఇన్‌సెట్) మంగమారిపేట వద్ద కోతకు గురైన తీరం

**భీమునిపట్నం/కొమ్మాది :** మిచాంగ్ తుపాను నేపథ్యంలో పెద్ద ఎత్తున కెరటాలు, బలమైన ఈదురుగాలులతో భీమిలి నుంచి గుడ్లవానిపాలెం బీచ్ వరకు తీరం అల్లకల్లోలంగా మారింది. మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల వద్ద కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడి తీరాన్ని కోతకు గురిచేసింది. రుషికొండ బీచ్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు, సాగర్‌నగర్‌లో కొబ్బరితోట పార్కు నీట మునిగాయి. మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి తీర ప్రాంతాల్లో సముద్రం కాస్త ముందుకు చొచ్చుకుని రావడంతో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. భీమిలి తీరంలో అలల తీవ్రతకు బోయివీధి గట్టు చాలా వరకు దెబ్బతింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే మత్స్యకారులు వేటకు స్వస్తి చెప్పి, పడవలు, బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. ఈదురుగాలులు ప్రభావంతో ఈ ప్రాంతాల్లో కొన్ని చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రుషికొండ బీచ్‌లో పర్యాటకులు సముద్రంలోకి వెళ్లకుండా ఎర్ర జెండాలను ఏర్పాటు చేశారు. కె.నగరపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో వర్షాలకు వరి పంట నీట మునిగింది.

## కేకే లైన్‌లో పలు రైళ్ల రద్దు

**తాటిచెట్లపాలెం:** కేకే లైన్‌లో తైడ-శివలింగపురం సెక్షన్ పరిధిలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడడంతో ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. మంగళవారం రాత్రి బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బుధవారం రాత్రి బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దయినట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో గురువారం బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేసినట్లు తెలిపారు. కిరండూల్‌లో మంగళవారం బయల్దేరిన కిరండూల్-విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం, కొత్తవలస మీదుగా ప్రయాణిస్తుంది.

## యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



**మహారాణిపేట:** జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు, ఎంపీడీవోలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో తన క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారితో పాటు 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండబోయే వారిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆయా కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

## మాజీ డీఎంహెచ్‌వోపై విచారణ

**మహారాణిపేట:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో వివిధ పోస్టుల భర్తీ, ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(పరిపాలన) శ్రీనివాస్ కుమార్, విజిలెన్స్ ఏవో వెంకటేశ్వరరావు కమిటీ సభ్యులుగా నియమించి.. నివేదిక సమర్పించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నివాస్ ఆదేశించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని.. పోస్టుల భర్తీ రికార్డులను పరిశీలించారు. కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల్లో నివేదిక పంపుతామని విచారణాధికారి ఒకరు చెప్పారు. కాగా.. గతేడాది జనవరి 8 నుంచి డిసెంబర్ 8 వరకు విశాఖ డీఎంహెచ్‌వోగా విజయలక్ష్మి పనిచేశారు. ఆ సమయంలో విశాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎనస్తీషియన్లు, రేడియోగ్రాఫర్లు, ఈసీజీ పోస్టులు, స్పీచ్ థెరపిస్టులు, వాచ్‌మెన్‌ల పోస్టులు భర్తీ చేశారు. విమ్స్‌లో ఎనస్తీషియా పోస్టుల భర్తీలో ఆరోపణలు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏడు పోస్టులకు సంబంధించి వివిధ కారణాల వల్ల ఓ వ్యక్తిని అనర్హుడిగా గుర్తించి మెరిట్ జాబితా నుంచి తొలగించారు. ఎంపిక అయిన మరో వ్యక్తి విధుల్లో చేరలేదు. మిగిలిన ఐదుగురు ప్రస్తుతం ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ ఎంపిక ప్రక్రియ అంతా అప్పటి డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, రిక్రూట్‌మెంట్ అధికారి డాక్టర్ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో జరిగింది.

## విశాఖ పోర్టు ఘనత

- కాల్సినేడ్ అల్యూమినా హ్యాండ్లింగ్‌లో సరికొత్త రికార్డు
- ఒకే నెలలో 7,630 మెట్రిక్ టన్నులు లోడింగ్‌తో విశాఖ పోర్టు చరిత్ర

**దొండపర్తి :** విశాఖ పోర్టు అథారిటీ మరో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఒకే నెలలో 7,630 మెట్రిక్ టన్నుల కాల్సినేడ్ అల్యూమినాను నౌకలో లోడింగ్ చేసి పాత రికార్డును అధిగమించింది. ఈస్ట్ క్యూ 3 బెర్త్‌లో ఈ ఏడాది నవంబర్‌లో సాధించిన 7,549 మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసింది. ఉత్కల్ అల్యూమినా ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఎంవీ హెచ్‌పీసీ నౌకలో 7,360 మెట్రిక్ టన్నుల కాల్సినేడ్ అల్యూమినాను లోడింగ్ చేసింది. ఎంవీ హెచ్‌సీపీ నౌకకు శ్రావణ్ షిప్పింగ్ సర్వీస్, ఈశ్వర్ షిప్పింగ్ సర్వీసులు స్టీమర్ ఏజెంట్లుగా వ్యవహరించాయి. ఈ రికార్డును సాధించడంలో కృషి చేసిన స్టీమర్ ఏజెంట్లను, స్టివ్‌డోర్లతో పాటు పోర్టు ట్రాఫిక్ మేనేజర్ బి.రత్నశేఖర్‌రావును పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. పోర్టు సిబ్బంది మరింత కృషి చేయడం ద్వారా మంత్రిత్వ శాఖ విధించిన టార్గెట్‌ను అధిగమించాలని పిలుపునిచ్చారు. రికార్డును సాధించడంలో కీలక పాత్ర పోషించిన ట్రాఫిక్ విభాగం సిబ్బందిని పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబె, కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు.

## మున్సిపల్ స్టేడియం ఆధునికీకరణ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

**డాబాగార్డెన్స్:** ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఆధునికీకరణ పనులు ప్రారంభించి.. వినియోగంలోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ స్టేడియంను మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేడియంలో పలు చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్యాలరీ, స్టెయిర్‌కేస్, ఫ్లోరింగ్, పెయింటింగ్, కామెంట్రీ బ్లాక్, అవసరమైన చోట చైన్ లింక్ మెష్, ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, మొక్కల పెంపకం, 5 ఏళ్లకు స్టేడియం కార్యకలాపాలు, నిర్వహణ పనులు చేపట్టేందుకు అంచనాలు తయారు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదారావును ఆదేశించారు. స్టేడియంలో 24 గంటలు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు సూచించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. వర్షాల వల్ల రోడ్డుపైకి వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికలు, అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట కార్యనిర్వాహక ఇంజినీర్లు సంతోషి, శేఖర్‌బాబు, ఏసీపీ వినయ్‌బాబు, ఏఎంవోహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర ఏర్పాట్ల పరిశీలన

**విశాఖ స్పోర్ట్స్ :** యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర ఏర్పాట్లను విశాఖలోని క్రీడాప్రాధికార సంస్థలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజ్, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పరిశీలించారు. ఈనెల 15నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో ఐదు స్థాయిల్లో పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా క్రీడాసామగ్రి సచివాలయాలకు అందించనున్నారు. వీడీఎస్‌ఏ చీఫ్ కోచ్ గాలియట్ ఏర్పాట్లను మంత్రి అమర్‌నాథ్‌కు వివరించారు.

# 8న విశాఖపురి మేరీమాత పండగ

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ప్రారంభమైన ఉత్సవ ఏర్పాట్లు

**డాబాగార్డెన్స్:** నగరంలోని పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి (రోస్‌హిల్స్)పై కొలువుదీరి అమలోద్భవి (విశాఖపురి మేరీమాత) రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత పుణ్యక్షేత్రం విశాఖకు ప్రత్యేక ఆభరణం. దీనినే 'కొండగుడి'గా భక్తులు పిలుచుకుంటారు. ఏటా డిసెంబరు 8వ తేదీన జరిగే కొండగుడి పండగకు హిందూ, ముస్లిం, కథోలిక, కథోలికేతర క్రైస్తవులు అశేషంగా తరలివస్తారు. కొండమాత ఉత్సవాలు దాదాపు తొమ్మిది రోజుల పాటు సాగుతాయి. ఉత్సవాలు గత నెల 29వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ శుక్రవారం వరకూ జపమాల, దివ్యపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు. కొండగుడిపై వెలసిన



విద్యుత్ దీపాల అలంకరణలో మేరీమాత గుహ

అమలోద్భవి మాత పట్ల అపారమైన నమ్మకం గల భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించుకొని, అమ్మ ముందు మోకరిల్లుతారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

**8న నిర్వహించే పూజలు**

వేకువజాము 4.30 గంటలకు ఆంగ్లంలోను, 5 గంటలకు తెలుగులో గుహవద్ద, 5.15, 6 గంటలకు ఆంగ్లంలో దేవాలయం వద దివ్యపూజ, ఉదయం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ, 7.30 గంటలలకు గుహవద్ద తెలుగులో విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్ పోంటిఫికల్ దివ్యపూజాబలి, తిరిగి ఉదయం 10, 11, 12 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ నూతన గురువులచే నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన కార్యక్రమం కత్తిపూడి విచారణకర్త ఫాదర్ సీహెచ్ రాజకుమార్‌చే నిర్వహించనున్నారు. అనంతరం విశాఖపురి మేరిమాత ద్వైమాస పత్రిక బైబిల్ క్విజ్, బైబిల్ పదకేళిలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తారు. సాయంత్రం 5, 6 గంటలకు గుహవద్ద తెలుగులో దివ్యపూజ జరపనున్నారు.



ప్రధాన ఆలయం

### ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు పోర్టు ఏరియా రోస్‌హిల్స్ కొండపై జరిగే విశాఖపురి(కన్యమరియమ్మ) పండగ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ట్రాఫిక్ నిబంధనలను పోలీసులు సూచించారు. ఈ పండగకు సుమారు లక్ష మందికి పైగా వచ్చే అవకాశాలు ఉన్నందున వాహనా మళ్లింపుకు పలు సూచనలు చేశారు.

- పాత పోస్టాఫీస్‌కు ఆర్టీసీ బస్సులతో పాటు వచ్చే అన్ని వాహనాలు సున్నపువీధి నుంచి వెలంపేట, గోపాల్ ఆటో జంక్షన్, లక్ష్మీటాకీస్ మీదుగా విక్టోరియా రాణి విగ్రహం వద్ద చేరుకుని తిరిగి అదే దారిలో వెనక్కి వెళ్లాలి.
- బీచ్‌రోడ్డు, కోటవీధి వైపు వచ్చే వాహనాలు బీచ్ రోడ్డులోనే సెయింట్ అలోసిస్ స్కూల్ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- సీహార్స్ జంక్షన్ నుంచి రోజ్‌హిల్స్‌కు వెళ్లే దారిలో ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాలు మాత్రమే హార్బర్ ఓల్డ్ పోలీస్ స్టేషన్‌జంక్షన్ వెనుక ఆదాని రోడ్డు, పప్పుల గొడౌన్ రోడ్డులో పార్కింగ్ స్థలాలు అనుమతించబడును.
- కన్వేయర్ బెల్ట్ రోడ్డులో సీహార్స్ జంక్షన్, రైల్ క్రాసింగ్ జంక్షన్ నుంచి రోజ్ హిల్స్ కొండ డౌన్ వరకు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- పోర్టు ఏరియాలోని వేంకటేశ్వర గుడి నుంచి రోజ్ హిల్స్ వైపు కూడా వాహనాలు అనుమతించరు.
- ద్విచక్ర వాహన చోదకులు తమ వాహనాలను కృష్ణథియేటర్, పాత రైల్వేస్టేషన్ స్థలం వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- కార్లను హార్బర్, ఓల్డ్ పోలీస్‌స్టేషన్ వెనుక ఆదాని రోడ్డులో, పోర్టు వేంకటేశ్వర గుడి వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- యాత్రికులు తీసుకు వచ్చిన బస్సులు కాన్వెంట్ జంక్షన నుంచి పోర్టు ఆర్చ్‌లో నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.

### శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ

**ఎంవీపీకాలనీ:** మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు. కౌన్సిలర్, డేటా ఎనలిస్ట్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కుక్, హెల్పర్ కమ్ నైట్ వాచ్‌మెన్ పోస్టులతో పాటు రెండు అవుట్ రీచ్ వర్కర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని, విద్యార్హతతో కూడిన పత్రాల జిరాక్స్‌లపై గజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఎంవీపీకాలనీలోని తమ కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు.

### 31 కి.మీ. సేవ్ సాయిల్ పరుగు




బీచ్ రోడ్డులో సుబ్రహ్మణ్యశర్మ

**దొండపర్తి:** సేవ్ సాయిల్ పేరుతో వైజాగ్ ఇషా వలంటీర్ చార్టర్డ్ సివిల్ ఇంజనీర్ సుబ్రహ్మణ్య శర్మ మంగళవారం 31 కిలోమీటర్లు పరుగు తీశారు. ఎంవీపీ కాలనీలో ప్రారంభించిన ఈ పరుగు బీచ్ రోడ్డు మీదుగా కోస్టల్ బ్యాటరీ, జగదాంబ, సంగం శరత్, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఎన్ఏడీ జంక్షన్ వరకు వెళ్లి తిరిగి మద్దిలపాలెం మీదుగా ఎంవీపీ కాలనీకి చేరుకున్నారు. మట్టిని పరిరక్షించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కోసం ఈ పరుగు తీసినట్లు చెప్పారు.

## క్లుప్తంగా

### గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ హఠాన్మరణం


గంగాధర్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న గంగాధర్ హఠాన్మరణం చెందారు. విధుల్లో చురుకుదనం, అంకితభావంతో పాటు తోటి సిబ్బంది, ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండే ఆయన అకాల మరణం చెందడాన్ని తోటి సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నిద్రలో ఉండగా గుండెపోటు రావడంతో ఆయన హఠాన్మరణం చెందారు. ఆయన సత్యసాయి సేవా సంస్థల ద్వారా నిర్వహించే సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిత్యం చురుగ్గా పాల్గొనేవారు. ఇటీవల జరిగిన సత్యసాయి జయంతి వేడుకల్లో చురుగ్గా పాల్గొని సేవలందించారు. ఆయన అకాల మరణం పట్ల పోలీసు ఉన్నతాధికారులు, స్టేషన్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

### భూ హక్కు పరిరక్షణ చట్టంలో మార్పులు అవసరం


మాట్లాడుతున్న జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాంబాబు

విశాఖ లీగల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భూ హక్కు పరిరక్షణ చట్టం లోపభూయిష్టంగా ఉందని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు అన్నారు. చట్టాన్ని సవరించాలని మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై బార్ కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తామన్నారు. ప్రభుత్వంతో సంప్రదించి చట్ట సవరణకు పూర్తి వివరాలు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, నాయకులు పి.నర్సింగరావు, జయ పృథ్వీరాజ్, డి.మంజులత మాట్లాడారు.



# అవకాశాల వేదిక.. ఆ హబ్

- ఆవిష్కరణలకు కేంద్రం
- యువ పారిశ్రామికవేత్తలకు ఊతం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఏర్పాటైన 'ఆ–హబ్' యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. వారికి విస్తృత అవకాశాలు సృష్టిస్తూ.. దేశంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆలోచనలే పెట్టుబడిగా వచ్చే యువతకు అన్ని తానై ప్రోత్సహిస్తూ.. దేశ ఆర్థిక పురోగతికి అవసరమైన చోదకశక్తిగా తీర్చిదిద్దుతోంది.

**ఇంతింతై వటుడింతై..**

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెండేళ్ల కిందట ఆ హబ్, నాస్‌కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాల సేవలు ప్రారంభమయ్యాయి. ఏయూ పూర్వ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బ్రెయిన్ చైల్డ్‌గా ఆ–హబ్ ఆరంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఆవిష్కర్తలుగా, భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆ హబ్ సేవలు ప్రారంభించింది. ప్రస్తుతం 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆ హబ్ సేవలందిస్తుండగా.. మరో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన వసతులు వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం మరో 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇది రానున్న రెండు నెలల్లో అందుబాటులోకి రానుంది. ఎస్‌టీపీఐ సహకారంతో మరో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన వసతులు 2024 చివరకు అందుబాటులోకి రానున్నాయి.


కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించే వసతులు

**వర్సిటీ నలుమూలలా..**

వికేంద్రీకరణ మంత్రంతో ఆ హబ్ పరిధిలో వర్సిటీ నలుమూలలా స్టార్టప్–ఇంక్యుబేషన్ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నారు. ఇంజినీరింగ్, సైన్స్, ఫార్మసీ, ఆర్ట్స్ కళాశాలల పరిధిలో విద్యార్థులకు ఉపయుక్తంగా ఇవి నిలుస్తున్నాయి. డీప్‌టెక్, ఏఐ, ఎంఎల్, డ్రోన్స్, ఈవీ, ఐవోటీ, ఫిన్‌టెక్, ఎడ్యుటెక్, లాజిస్టిక్స్, జీఐఎస్, ఎన్విరాన్‌మెంట్, ఫుడ్–రిటైల్, కనస్ట్రక్షన్ ఇంజినీరింగ్, ఎనర్జీ, హెల్త్–వెల్‌నెస్, మెరైన్ టెక్నాలజీ, బయోటెక్, ఐవోటీ, లాజిస్టిక్స్ టెక్, ఐటీ, తదితర రంగాలకు సంబంధించిన సంస్థలు ఇక్కడ నుంచి సేవలు అందిస్తున్నాయి.

**350 స్టార్టప్‌లే లక్ష్యం :** 2025 నాటికి ఏయూలో 350 స్టార్టప్ సంస్థలు సేవలందించడమే లక్ష్యంగా ప్రస్తుతం ఆ–హబ్ పనిచేస్తోంది. అలాగే రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మౌలిక సదుపాయాలు, రూ.500 కోట్ల ఆదాయ సముపార్జన, 1,800 మంది యువతకు పూర్తిస్థాయిలో ఉద్యోగాల కల్పన లక్ష్యాలుగా నిర్దేశించుకుంది.

**అన్నీ తానైన ఏయూ**

స్టార్టప్ కేంద్రాలు ఏర్పాటు చేసే యువతకు అవసరమైన మార్గదర్శకం అందించడం, ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, నిధుల సమీకరణతో పాటు వారికి అవసరమైన మౌలిక వసతులు, ప్రయోగశాలలను ఏయూ అందుబాటులో ఉంచింది. ఇక్కడ నిర్వహించే స్టార్టప్ ఈవెంట్‌లు పెట్టుబడులను ఆకర్షించడానికి యువతకు దోహదపడుతున్నాయి. ఇక్కడ ఉత్పత్తులకు బ్రాండింగ్ సైతం ఆ హబ్ చేస్తోంది. తక్కువ ఖర్చుతో నగరం మధ్యలో కో వర్కింగ్ స్పేస్ లభించడం నిర్వాహకులకు అతి పెద్ద వనరుగా మారింది.

### 630 మందికి ఉపాధి

**ఆ హబ్‌లో ప్రస్తుతం ఉన్న 154 స్టార్టప్‌ల్లో 147 సంపదలను సృష్టిస్తున్నారు. వీటిలో 630 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. విద్యార్థు**లకు స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌లను సైతం పలు సంస్థలు అందిస్తున్నాయి. ఇప్పటికే 350 మందికిపైగా యువత చదువుకుంటూ.. ఇక్కడ ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. స్టార్టప్ వ్యవస్థపై అవగాహన పొందడం, కార్పొరేట్ పనితీరుకు వీలుగా తమను తాము సిద్ధం చేసుకున్నారు.


బోర్డు రూమ్‌లో సిబ్బందితో చర్చిస్తున్న ఓ సంస్థ నిర్వాహకులు


ఆ హబ్ భవనం

| | |
|---|---|
| ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ వ్యవస్థలో పనిచేస్తున్న సంస్థల సంఖ్య | 154 |
| ఆ హబ్ పర్యవేక్షణలో పనిచేస్తున్న సంస్థలు | 103 |
| నాస్‌కామ్ పరిధిలో పనిచేస్తున్న సంస్థలు | 51 |
| ప్రస్తుతం వినియోగంలో ఉన్న స్థలం | 55 వేల చ.అ |
| వినియోగానికి సిద్ధంగా ఉన్న స్థలం | 60 వేల చ.అ |
| అభివృద్ధి చేస్తున్న స్థలం | 35 వేల చ.అ |

### 2025 నాటికి లక్ష్యాలు

- రెండు లక్షల చ.అ. విస్తీర్ణంలో సేవలందించడం
- 350 స్టార్టప్‌లకు సహకారం, మార్గదర్శకం
- రూ.500 కోట్ల రెవెన్యూ జనరేషన్
- 1,800 మందికి పూర్తిస్థాయి ఉపాధి కల్పన

### నిర్వహణ భారం తగ్గింది



గతంలో నగరానికి దూరంగా మా సంస్థ ఉండేది. ఏయూలో వసతులు చూసి ఇక్కడకు వచ్చేశాం. ఇతర ప్రాంతాల్లో పోల్చితే ఆ హబ్‌లో మాకు అవుతున్న ఖర్చు చాలా స్వల్పం. ప్రస్తుతం నో కోడ్, ఐవోటీ సంబంధిత రంగాలపై పనిచేస్తున్నాం. మా సంస్థలో 18 మంది పనిచేస్తున్నారు. నగరం మధ్యలో కాన్ఫరెన్స్ హాలు, ఇంటర్నెట్‌తో సహా అన్ని వసతులు కలిగిన కేంద్రంగా ఇది నిలుస్తోంది. ప్రయాణ సమయం బాగా తగ్గింది.

–కోటిపల్లి అమరేంద్ర, బీఏ ఇన్ఫోటెక్, ఆ హబ్

### వసతులు సూపర్



తక్కువ ఖర్చుతో ఎక్కువ వసతులను ఆ హబ్ కల్పిస్తోంది. బోర్డ్ రూమ్, ఇంటర్నెట్, 24X7 విద్యుత్, ఏసీతో పాటు వర్కింగ్ స్పేస్ వంటివి నగరం మధ్యలో కల్పించడం మాకు ప్లస్. అదే సమయంలో విభిన్న సంస్థలు ఒకే చోట పని చేయడం వలన ఏయూ విద్యార్థులకు అవగాహన, ఆసక్తి కలిగిస్తున్నాయి. ఇక్కడ పనిచేసే సిబ్బందికి ఇతర టెక్నాలజీని తెలుసుకునే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం మా సంస్థ ఎలక్ట్రికల్ వెహికల్స్, ఎడ్యుటెక్, ఇండస్ట్రీ 4.0 రంగాలపై పనిచేస్తోంది. మా దగ్గర 18 మంది పని చేస్తున్నారు.

–ఎస్. వెంకట రెడ్డి, సీఈవో, విహాన్ ఎలక్ట్రిక్స్, టెకిబాట్

### విద్యార్థులకు ఉపయుక్తం



గతంలో నేను ఓ విద్యా సంస్థలో బోధన, పరిపాలన పదవుల్లో పనిచేశాను. విద్యార్థులకు ఇటువంటి కేంద్రం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. యువతను, పరిశ్రమకు అనుసంధానం చేసే కేంద్రంగా ఆ హబ్ నిలుస్తుంది. కార్పొరేట్ కల్చర్ ఎలా ఉంటుంది, ఎలా పనిచేయాలి అనే విషయాలను విద్యార్థులు స్వయంగా చూసి నేర్చుకునే అవకాశం కలుగుతుంది.

– డి.హిందు, అడ్మిన్ మేనేజర్, టెకిబాట్

## జైలులో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్


జైలు ఇంక్యుబేషన్ సెంటర్ సభ్యులతో అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన ఐదుగురు ప్రతినిధులను ఈ కేంద్రంలో సభ్యులుగా నియమించారు. వీరు మంగళవారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఇక్కడ ఖైదీలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. అనంతరం జైలు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ జైలులో జరుగుతున్న అభివృద్ధి, ఖైదీలకు అందుతున్న సేవలు మరింతగా మెరుగుపరచడానికి సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని కేంద్ర కారాగారాల్లోనూ వీటిని ఏర్పాటు చేశారన్నారు. ఖైదీలకు చేతి వృత్తుల్లో అవగాహన కల్పించడం, ఖైదీలు విడుదలైన తర్వాత బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించడం, మానసిక పరివర్తనకు వీరు తగిన చర్యలు చేపడతారన్నారు.

## పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: కాజీపేట–కొండపల్లి సెక్షన్ వరంగల్, విజయవాడ–గూడూరు సెక్షన్ ఒంగోలు, సూరారెడ్డిపాలెం స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మూడో లైన్ నిర్మాణానికి సంబంధించిన ప్రి నాన్ ఇంటర్‌లాకింగ్, ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం విశాఖపట్నం మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- ఈనెల 5,6,8,9,11,12, 13,15,16,18,19 తేదీల్లో తిరుపతి–పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, 7,8,10,11,12,14,15,17,18,20,21 తేదీల్లో పూరీ–తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్, 7,10,14,17 తేదీల్లో తిరుపతి–బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్, 9,12,16,19 తేదీల్లో బిలాస్‌పూర్ –తిరుపతి (17481)ఎక్స్‌ప్రెస్, 10,17 తేదీల్లో తిరుపతి–విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో విశాఖపట్నం–తిరుపతి (22707)డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో విశాఖపట్నం–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22869) ఎక్స్‌ప్రెస్, 12, 19 తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ –విశాఖపట్నం(22870) ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో విశాఖపట్నం–తిరుపతి (08583)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 12,19 తేదీల్లో తిరుపతి–విశాఖపట్నం (08584)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 9,16 తేదీల్లో హౌరా–ఎర్నాకుళం (22877)ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో ఎర్నాకుళం–హౌరా (22878)ఎక్స్‌ప్రెస్, 13,20 తేదీల్లో తాంబరం–సంత్రగచ్చి (22842)ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో సంత్రగచ్చి –తాంబరం (22841)ఎక్స్‌ప్రెస్, 15న హౌరా–మైసూరు (22817) ఎక్స్‌ప్రెస్, 17న మైసూరు–హౌరా(22818) ఎక్స్‌ప్రెస్, 15న సంత్రగచ్చి–ఎంజీఆర్‌చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, 17న ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్, 7,14 తేదీల్లో టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, 10, 17 తేదీల్లో యశ్వంత్‌పూర్–టాటానగర్(18112) ఎక్స్‌ప్రెస్, 13న షాలిమర్–సికింద్రాబాద్(22849) ఎక్స్‌ప్రెస్, 15న సికింద్రాబాద్–షాలిమర్(22850) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

భద్రతాపనుల నిమిత్తం ఈ నెల 16,17 తేదీల్లో విశాఖ–మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్, 17,18 తేదీల్లో మహబూబ్‌నగర్–విశాఖ(12862) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

**దారి మళ్లించిన రైళ్లు**

ఈ రైళ్లు వయా పగిడిపల్లి–గుంటూరు–విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఈనెల 16,17 తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 17, 18 తేదీల్లో హైదరాబాద్–షాలిమర్ (18046)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 6, 7 తేదీలతోపాటు 9 నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, 10 నుంచి 18వ తేదీ వరకు లోకమాన్యతిలక్ టెర్మినస్– విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, 16, 17 తేదీల్లో భువనేశ్వర్–ముంబయి (11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 16,17 తేదీల్లో ముంబయి–భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్.

**ఈ రైళ్లు రెగ్యులర్ మార్గంలో కాకుండా విజయనగరం, రాయగడ, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.**

ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నం –న్యూ ఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్, 9 నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీ–విశాఖపట్నం(20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, 7,14వ తేదీల్లో విశాఖపట్నం–గాంధీదాం (20803) ఎక్స్‌ప్రెస్, 10,17వ తేదీల్లో గాంధీదాం –విశాఖపట్నం(20804) ఎక్స్‌ప్రెస్, 10,17వ తేదీల్లో పూరీ–ఓఖా(20819)ఎక్స్‌ప్రెస్, 6, 13వ తేదీల్లో ఓఖా–పూరి (20820)ఎక్స్‌ప్రెస్, 11,15,18వ తేదీల్లో విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్ (12803) ఎక్స్‌ప్రెస్, 10, 13, 17వ తేదీల్లో హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం (12804)ఎక్స్‌ప్రెస్.



## కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

- పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్
- త్రీ టౌన్, ఫోర్తుటౌన్, ద్వారకా స్టేషన్ల తనిఖీ
- రికార్డుల పరిశీలన, సిబ్బంది వివరాలపై ఆరా


సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్ మంగళవారం త్రీ టౌన్, ఫోర్త్ టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను సందర్శించారు. రికార్డులు పరిశీలించడంతోపాటు సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫోర్త్ టౌన్ క్రైం పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన, వినియోగంలో లేని వాహనాలను పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది షిఫ్టులు, జనరల్ డైరీ, స్టేషన్ సిబ్బంది పనితీరుపై సమీక్షతో పాటు ఇతర అంశాలపై తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బీచ్, పర్యాటక ప్రాంతాలను చూడటానికి వచ్చే పర్యాటకుల రక్షణ కోసం త్రీటౌన్ టూరిస్ట్ పోలీసుస్టేషన్‌లో సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న విహార యాత్రలకు ప్రజలు ఎక్కువగా రావటానికి అవకాశం ఉందని, ఈ ప్రాంతాల్లో పోలీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌శాండ్ పెట్రోలింగ్ ద్వారా తీర ప్రాంతంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. సీసీ టీవీ కెమెరాలు మరిన్ని వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లు సస్పెక్ట్ షీటర్స్ ప్రతి కదలిక ఎల్లప్పుడు పరిశీలించాలని తెలిపారు. గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని పేర్కొన్నారు. స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డీసీపీ-1, శ్రీనివాస్, ఈస్ట్ ఏసీపీ డిఎస్ఆర్‌విఎస్ ఎన్‌మూర్తి, ద్వారకా ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్. మూర్తి, సీఐలు ఎస్.విజయకుమార్, సోంశేఖర్, కోరాడ రామారావు, ఎస్ఐలు ధర్మేంద్ర, శ్రీను, వెంకటరావు, ప్రమిల, సిబ్బంది పాల్గొన్నారు.

### మందుబాబులకు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష


సెయింటాన్స్ స్కూల్‌లో తుప్పలు తొలగిస్తున్న మందుబాబులు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 121 మందికి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మంగళవారం రూ.వెయ్యి వంతున జరిమానాతో పాటు కమ్యూనిటీ శిక్ష విధించారు. ఇందులో భాగంగా మందుబాబులతో సెయింటాన్స్ స్కూల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసరాలు, బీచ్‌రోడ్డులోని కొబ్బరితోట పార్కును శుభ్రం చేయాలని ఆదేశించారు. దీంతో ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు ఆధ్వర్యంలో మందుబాబులు శుభ్రం చేశారు.

## వేపకొమ్మలు చేతపట్టి.. బురదను జల్లుకుంటూ....!

వింత జాతరలో ఉత్సాహంగా పాల్గొన్న పురుషులు


బురదోత్సవంలో పాల్గొన్న యువకులు


బురదమాంబ అమ్మవారు

రాంబిల్లి : వింత జాతరగా పేరొందిన దిమిలి బురదమాంబ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము 3 గంటల నుంచే పురుషులంతా వయసుతో సంబంధం లేకుండా వీధుల్లోకి వేప కొమ్మలు చేతపట్టి వచ్చారు. మురుగు కాలువలు, సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన బురదలో వేపకొమ్మలు ముంచి బురదను ఒకరిపై ఒకరు జల్లుకున్నారు. ఈ జాతర సమయంలో గ్రామంలోకి ప్రవేశించిన ఇతర గ్రామస్తులకు బురద జల్లి గ్రామ ఆచారాన్ని చాటుకున్నారు. దల్లమాంబ అనుపు ఉత్సవంలో భాగంగా మంగళవారం బురదమాంబ జాతరను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఈ బురద ఉత్సవంలో ఆడవారికి మినహాయింపునిచ్చారు. ఉదయం 11 గంటల వరకు ఈ జాతర కొనసాగింది. అనంతరం బురద ఉత్సవంలో వినియోగించిన వేపకొమ్మలను అమ్మవారి ఆలయం వద్ద ఉంచి పూజలు చేశారు. బురద ఒళ్లంతా పులుముకున్నా ఎటువంటి చర్మవ్యాధులు సోకకపోవడం అమ్మవారి మహత్యమని, ఇందులో పాల్గొన్న వారికి సకల శుభాలు కల్గుతాయని గ్రామస్తుల విశ్వాసం.

## రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

తాటిచెట్లపాలెం: నార్కోటిక్స్‌ను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన విక్కీ(స్నిఫర్ డాగ్) విశాఖ రైల్వేస్టేషన్‌లో తన విధులను ప్రారంభించింది. విధులు ప్రారంభించిన తొలి రోజే(ఈ నెల 2వ తేదీ) 12 కిలోల మత్తు పదార్థాలను గుర్తించింది. రైల్వేస్టేషన్‌లో మత్తు పదార్థాలు, అసాంఘిక శక్తులను గుర్తించడంలో టాస్క్‌ఫోర్స్, ఆర్పీఎఫ్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. స్టేషన్‌లో భద్రతా ప్రమాణాలు పెంపులో భాగంగా తాజాగా డాగ్ స్క్వాడ్ అందుబాటులోకి వచ్చింది.

## 'మిలినీయం' స్కాలర్‌షిప్‌నకు 1000 మంది ఎంపిక


కేక్ కట్ చేస్తున్న సెంట్రల్ మేనేజర్ రవికుమార్, యాజమాన్య ప్రతినిధులు

సీతమ్మధార: మిలినీయం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన మేట్ మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌కు 1000 మంది ఎంపికయ్యారు. స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన పరీక్షకు 2,562 మంది హాజరయ్యారని మిలినీయం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాలర్‌షిప్ పరీక్షల్లో విజయం సాధించిన మొదటి ఐదుగురికి ముందుగా ప్రకటించినట్లు బహుమతులు అందజేస్తామన్నారు. సి.హెచ్.మనోజ్ (గీతం)కు రూ.50 వేలు, జి.వి.ఎస్.ఎస్.మధులిత(ఏయూ)కు ల్యాప్‌టాప్, ఆర్.అర్జునరావు(బాలాజీ డిగ్రీ కళాశాల)కు ట్యాబ్, వి.అమృత ఖాయ(సీతం కళాశాల) కు వాచ్, ఎస్.సంతోష్‌కుమార్ (బాలాజీ డిగ్రీ కళాశాల)కు బ్యాగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆరు నుంచి 500 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు ఆయా కోర్సుల్లో చేరిన వారికి 35 శాతం ఫీజు రాయితీ ఇస్తామన్నారు. మిగిలిన ఐదు వందలు ర్యాంకులు సాధించిన వారికి 25 శాతం ఫీజు రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులను ఏపీ ప్రభుత్వ సలహాదారు( స్కిల్ ట్రెయినింగ్ అండ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్ రెడ్డి అభినందించారు.